# గాలిమార్పు

నిత్యానందం దుఃఖించాడు. టి.బి. ప్రారంభం దశ. గాలి మార్పు అవసరం. విశ్రాంతి ముఖ్యం. పుష్టికరమైన భోజనం తప్పదు. తీర్థయాత్రలో పుణ్యక్షేత్రాలో దర్శించే నెపంతో ఊరువదిలి వెళితే మేలు. వేరే ఊళ్ళలో ఉన్న బంధువుల ఇళ్ళలో కొంతకాలమున్నా మంచిదే! ఉన్న ఇంట్లో ఉండవద్దు. ఇల్లయినా మార్చగలిగితే బాగుంటుంది. డాక్టరు ప్రేమగా చాలా సూచనలు చేశాడు. తానివేవీ చేయలేదని తనకు తెలుసు. డాక్టరుకు ఎలా తెలుస్తుంది?

నిత్యానందం తేవాలి. ఇల్లు గడవాలి. తల్లి దండ్రులు గతించినా తల్లిదండ్రుల్లా పిల్లలున్నారు. తన చిన్నారి తల్లి పది, ముద్దుల తండ్రి ఎం.ఎ. చదువుతున్నారు. వాళ్ళ తల్లి ఉత్తమ ఇల్లాలు. ఉందో లేదో గుట్టుగా ఇల్లు గడుపుకొస్తుంది. వంట బాగానే చేస్తుంది. ఉన్నంతలో నిత్యానందానికి అన్నం సహించదు. మంచి భోజనం మాట కాదుగానీ, అసలు అన్నమే ముట్టబుద్ధికాదు.

గాలి మార్పు కుదరదు. వేరే ఊరుపోయే అవకాశం లేదు. ఈ ఉద్యోగం చేస్తేనే ఇల్లు గడుస్తుంది. మానితే పస్తులే. ఊరు మారదు. ఉన్నచోటు మారదు. గాలెట్లా మారుతుంది? ఈ పని చేయాలి. ఈ గాలి పీల్చాలి. తప్పదు.

తనకు పని స్థలమే నివాస స్థలం. తనున్న చోట భార్యాపిల్లలుండరు. భార్యా, పిల్లలతో కాస్తంత మెరుగైన చోటే ఉంది. తన ఉద్యోగానికి సెలవు లేదు. తీరిక ఉండదు. ఎవరినైనా అడిగితే రోజంతా తీరికే గదా అంటారు. కుర్చీలో కూర్చుని ఉండటమే కదా అంటారు. రాత్రి లేదు, పగలు లేదు, రోజంతా, వారమంతా, నెలంతా, సంవత్సరమంతా, జీవితమంతా కూర్చుని ఉండటమే. తిండి అక్కడే! తీర్థమక్కడే, నిద్ర అక్కడే! మెలుకువ అక్కడే!

తనకేం కుర్చీ ఉంది, చాపాదిండూ ఉన్నాయి. నిద్రవస్తే నిద్రపోవచ్చు. మెలకువ వస్తే పని చేసుకోవచ్చు. అదీ కుదరదు. అసలు నిద్రే పోరాదు. టీకి కూడా పక్కకి పోరాదు. పోవచ్చు. సంపాదన పోతుంది. సంపాదన కోసం ఎటూ పోరాదు. నిద్రా పోరాదు.

యజమాని ఇద్దరు ఉద్యోగుల్ని నియమించుకోవాలనుకొన్నాడు. ఒక్కొక్కరికి మూడువేలు జీతం ఇవ్వటానికి సిద్ధపడ్డాడు. కూర్చోవటమే కదా తనే కూర్చుంటానన్నాడు.

అలా అయితే జీతముండదన్నాడు. ఎంత వసూలైన నీ సొంతమేనన్నాడు. కానీ రోజుకు మూడొందలు తనపేరిట బేంకులో జమ చేయాలన్నాడు. నిత్యానందం అంగీకరించాడు. పద్దైదేళ్ళలో ఏ రోజూ వారా లేకుండా జమ చేస్తూనే ఉన్నాడు. మాట పడలేదు.

తను నిద్రపోతే వసూలు తగ్గిపోతుంది. పక్కకుపోతే ఆదా చెడుతుంది. తను విశ్రమిస్తే లక్ష్మినిష్క్రమిస్తుంది. లక్ష్మి రాకపోతే ఇల్లు వల్లకాడవుతుంది. తన పనికి వసూలయ్యే డబ్బు సముద్రంలా ఎప్పుడూ పొంగి పొర్లుతూ ఉండదు. చెడిపోయిన మునిసిపాలిటి పంపులా ఒక్కొక్క చుక్కా పడుతూ ఉంటుంది. ఈ చుక్కలు పట్టుకొంటే బిందెలు నిండుతాయి. ఇల్లు గడుస్తుంది. అశ్రద్ధ చేస్తే అంతే సంగతులు.

ఈ టి.బి. తమ వంశపారంపర్య రోగంకాదు. ఈ జబ్బు తాతముత్తాతలు తనకివ్వలేదు. తాను తన కొడుక్కు ఈ జబ్బు వారసత్వంగా ఇవ్వరాదు. పిచ్చిది నిర్మలమ్మ, తనకేం తెలుసు, నువ్వు పన్నెండు గంటలు, నీ కొడుకు పన్నెండు గంటలీ పని చేసుకోవచ్చు, కదా అంటుంది. అమాయికపుది, అనకేం చేస్తుంది. టి.బి. నాకేకాక వాడిక్కూడా కావాలని రావాలని అడుగుతున్నట్లు ఆమెకు తెలియటంలేదు. ఈ పని చేస్తున్నప్పటి నుంచే కదా తనకు టి.బి. రావటం. కొడుకూ చేయసాగితే, వాడికీ టి.బి. వచ్చి తీరుతుంది. ఒక్క మనిషి చేసే పనీ, వచ్చే ఆదాయం ఇద్దరూ చేసి తెచ్చుకోవటం ఏం గొప్ప? ఇద్దరూ పనిచేస్తున్నట్లే! ఆదాయం మాత్రం మారదు. ఎందుకొచ్చిన తిప్పలు?

కొడుక్కు టి.బి. రాకూడదని నిత్యానందం నిశ్చితాభిప్రాయం. ఈ పని అతను చేయరాదని స్థిర సంకల్పం.

తన ముత్తాత నడి వీధిలో చెప్పులు కుట్టేవాడు, టి.బి రాలేదు. తాతది పాకీ పని టి.బి. రాలేదు. తన తండ్రి మున్సిపాలిటీ స్వీపర్, దుమ్ము పీల్చి, దొమ్మలు గరిసెలుపడి, ఊపిరితిత్తులు పాడై, టి.బి.వచ్చి దగ్గలేక, ఉమ్మి వేయలేక, మందులు కొనలేక, కూరన్నం తినలేక, నానా అవస్థలు పడి ఉండాలి. టి.బి.రాలేదు. సుఖంగానే చచ్చిపోయాడు.

తాను బి.ఏ. పాసయ్యాడు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కానీ తనకు ఉద్యోగం రాలేదు. ఎన్నో పనులు చేశాడు. చివరికిలా స్థిరపడ్డాడు. పాసింజెర్లు వస్తారు. ఒకటో, రెండో, మూడో టేబిలుమీద పెట్టి పోతారు. ఆదమరిస్తే ఎగ్గొట్టి వెళతారు. అందుకే నిఘా పోలీసులాగా ఉండాలి. కొందరు లేదంటారు. కొందరు బ్రతిమాలతారు, కొందరు బెదిరిస్తారు. కొందరు ఉరిమిచూచి వెళతారు. పుణ్యాత్ములు, మాట్లాడితే కొడతారు.

బేంకులో సొమ్ము జమచేయగా, రోజుకు రెండో మూడో నాలుగో నూర్లు సొమ్ము మిగులుతుంది. ఇందులో చిల్లరమల్లర చీదర ఖర్చులు పోగా మిగిలింది, నిర్మలమ్మ

తీసుకుపోతుంది. అందులోనుంచే తిండీ తీర్థం. ఇంటి అద్దె. తమకూ పిల్లలకు బట్టలు. వాళ్ళ చదువులు. సరుకుల ఖర్చులు. సంసారం సాగరం కదా!

ఆ డబ్బులోంచి గమాక్సిన్, ఫినాయిల్, సున్నం, చీపురు, చేట. మునిసిపాలిటీ నీళ్ళ మారాజుకు, పోలీసుల బీడీలకు, వీధులూడ్చే పెద్దయ్య స్పెషల్‌గా ఇక్కడ ఊడ్చినందుకు సర్దుబాటు చేయాలి. టీ, సోడా తాగాలన్నా ఇదే.

ఇంకా ఏం మిగులుతుందని, ఈ కరువు రోజుల్లో పుష్టికరమైన భోజనం? ఏం పెట్టి మందులు? ఏం పెట్టి తీర్థయాత్రలు, పుణ్యక్షేత్రాలు? పని వదిలి పోవాలన్నా ఇక్కడెవరుంటారు? ఎవరినైనా ఎంతకాలం ఈడ ఉంచగలడు? ఏ అమాయకుడికో ఈ టి.బి. ఎందుకు తెచ్చిపెట్టాలి?

నిత్యానందం ఎక్కడికీ పోడు, ఏమీ తినడు, నిద్రపోడు. విశ్రాంతి లేదు. గాలిమార్పు గగనం. ఇదే గాలి, ఇదే నీరు, ఇదే నేల తప్పదు.

చిత్రం! మొదట్లో మరో పని దొరికితే వెళ్ళిపోవాలని ఎంతో ఆరాటంగా ఉండేది. ఆరాటం తగ్గింది. టి.బి. వచ్చిందాకా, రావటం ఈ పని వల్లనే కదా, మానదామనిపిస్తుందా? అప్పుడప్పుడు అనిపిస్తుంది. మానితే ఇల్లెలా గడుస్తుంది? అప్పుడు మానొద్దనిపిస్తుంది. మానకపోతే తొందరలోనే చనిపోతాను కదా? కొడుక్కేదయినా ఉద్యోగం వస్తే తననీపని మానిపిస్తాడు. ఈ పని మానితే మరేంచేయాలి? రోజులెలా గడవాలి, గానుగెద్దు జీవితం. తిరుగుతూనే ఉండాలి. ఆగితే చచ్చినంత చావు అవుతుంది. ఇప్పుడు తనీపని మానలేడు. అలవాటుకు బానిస. సిగరెట్లు, బ్రాందీలు, వ్యభిచారం, దొంగతనం ఇవి మత్రమే అలవాట్లు కావు. ఈ పనే తన అలవాటు. దీని నుంచి తను బయటపడలేడు. బయట పడటం మృత్యు సమానం. ఏ పనీ లేకుండా చావటంకంటే ఈ పని చేస్తూ చావటం సుఖం. కర్మణ్యేవాధికారస్తే! ఎంత బూతుమాట! ఈ పనివల్ల ఏం అధికారం వస్తుంది? మృత్యువు తప్ప! నిత్యానందం మృత్యుముఖంగా జీవిస్తున్నాడు. ఎవరైనా అంతేనేమో! ప్రతిక్షణం మృత్యువుకు అభిముఖంగా నడుస్తూనే ఉంటాడు కదా మనిషి? ఈ ప్రయాణంలోనే ఆనందం సుఖం సంతోషం ఆరాటం పోరాటం తాపత్రయం ఇల్లూ ఇల్లాలూ పిల్లలూ.

ఆడవాళ్ళయినా, మగవాళ్ళయినా, అందంగా అలంకరించుకొని బొమ్మల్లాగా వీధుల్లో తిరుగుతుంటే చూడముచ్చటగా ఉంటుంది. ఎవరి ఏ జీవన తాపత్రయం చూసినా ఎందుకో బాగుండదు. బస్సుల్లో వేలబడుతున్న మగవాళ్ళని, బస్సులకోపం పరుగెత్తే ఆడవాళ్ళను చూడటమే కష్టంగా ఉండే మనిషికి వాళ్ళు పేంటులు, వీళ్ళు చీరెలు పైకి ఎగబీకుతూ కిందికి దిగలాగుతూ ఉంటే చూడటం కష్టమే!

రొచ్చు గచ్చులమీద, తడి బండలమీద, చూచి నడవకపోతే కాలజారి పడితే, మగవాళ్ళయినా, ఆడవాళ్ళయినా ఇంతే సంగతులు. ఎముక విరిగినా, కీలు తొలిగినా, సడుగులు జారినా, సాయంకాలం పక్కసందు గుడిలో వినిపించే శివగోవింద గోవింద, హరగోవింద గోవింద.

నిర్మలమ్మ వంగి కొంత వంగక కొంత ఇల్లూడవడమే గొప్ప. వీధులూడవదు. మట్టి అంటుకొన్న ఈ గచ్చు ఊడవదు. టాపుల్లో నీళ్ళు రాకపోతే తొట్టినీళ్ళు దిమ్మరించి రావటం అసలు చేయదు.

పాసింజర్లు వస్తూ ముక్కు మూసుకొన్నా, పోతూ మూసుకొన్నా న్యాయమే! నిర్మలమ్మ మాటలు ముక్కును మూతిని మూసుకొన్న పైట చెంగులోంచి ఫిల్టర్అయి వస్తుంటాయి. ముక్కు మూసుకోవటం పాసింజర్లకు న్యాయమైతే నిర్మలమ్మకూ న్యాయమే! తాను ముక్కు మూసుకోవటం న్యాయమా? న్యాయమయినా సాధ్యమా? ఇరవైనాలుగ్గంటలూ ముక్కు మూసుకొంటాడా? చావడూ?

మంచి భోజనం తినాలి. నిర్మలమ్మ వీలయినంతలో మంచి భోజనమే తెస్తుంది. తనే తినలేదు. అసలు భోజనమే ఇష్టం ఉండదు. ఆకలి చచ్చిపోయింది. కాఫీ టీలు తాగుతాడు. బన్ను తింటాడు. అదీ బలవంతపు తిండి. ప్రాణభయంతో ఆ తినటం.

నిర్మలమ్మ అన్నం తెస్తుందికానీ వడ్డించదు. మూతిమీద ముక్కుమీద చెంగునుంచిన చేయితీయదు. ఆమె ముఖం కూడా సరిగా కనిపించదు. 'పాడుసచ్చినోడా, ఈడ, ఈడ, కూడు ఎట్టాతినిసస్తావురా సన్నాసోడా' అన్నట్లుగా నిలబడితే ఏ మగాడయినా ఏం చేస్తాడు? తిండి మానతాడు. లేదంటే పెళ్ళాన్ని తన్ని తరిమేస్తాడు. పుట్టింటికే పోతుందో, వల్లకాటికే పోతుందో, దానిష్టం దానెమ్మిష్టం. నిత్యానందం తిండి మానాడు కానీ, పెళ్ళాన్ని నోరెత్తి మాటనడు. చేయెత్తి దెబ్బ కొట్టడు.

'తిను సామి, తినుదేవుడు, నాలుగు మెతుకులు తిను, పాడురోగం టి.బి. వచ్చిసచ్చే. తినకపోతే ఎట్టా? ముదరదూ? తిను తండ్రి, తిను నాయనా?, మూతికడ్డం గుడ్డలోంచి మాటలురాలి పడతాయి. ఏడుస్తుంది. అన్నం తినాలనే ఉంటుంది. పెళ్ళాన్ని నవ్వించాలనే ఉంటుంది. కానీ సాధ్యం కాదే! ఏం చేస్తాడు?'

కొట్టుకొనేది గుండె పీచ్చేవి ఊపిరితిత్తులు. గాలి బాగుంటే గుండె బాగుంటుంది. నిజమే! బాగుండక పోవడానికి గాలికేం రోగం? రోగమే! మనుషులు పుణ్యాత్ములు దేన్ని కల్తీలేకుండా ఉంచారు! గాలిననేం ప్రయోజనం? మనిషికేం? మనిషి బాగానే ఉన్నాడు. పాడయ్యేది గాలే!

పాడుగాలి మనిషి పీలుస్తాడా? పీల్చడు! పీల్చవలసి వస్తే ముక్కుకు గుడ్డ అడ్డం పెట్టుకుంటాడు. మరి తనెందుకు చెడుగాలి పీలుస్తున్నాడు, గుడ్డ అడ్డులేకుండా.

విధి వంచిస్తే, ప్రకృతి శపిస్తే, సంఘం మోసగిస్తే, ఆర్థిక దోపిడీ ఘనీభవిస్తే బ్రతకటానికి మనిషి ఎంతకయినా తెగిస్తాడు. ఏదయినా భరిస్తాడు. ఏమయినా చేస్తాడు. మృత్యుముఖంలోకే నడకని తెలిసినా, బ్రతికి ఉన్నంతకాలం నడుస్తూనే ఉంటాడు. ఏనాడో వచ్చే చావుకోసం, ఈనాటినుంచీ చావక ఆనాటిదాకా బతకటంకోసం నిత్యానందం బతుకుతున్నాడు.

ఇంటికోసం, తిండికోసం, తనను నమ్ముకొన్న వాళ్ళకోసం నిత్యానందం చావును ఆనందంగా ఆహ్వానిస్తున్నాడు. క్షణంలో వచ్చే చావుకాదు. సంవత్సరాల తరబడి నిరీక్షిస్తూ తీసుకుంటూ తీసుకుంటూ చచ్చే చావుకోసం నిరీక్షిస్తున్నాడు. వాళ్ళు సుఖంగా బతకటంకోసం, తనిలా బతకటం తప్పదు.

అది నాలుగు రోడ్ల కూడలి. రద్దీ ఎక్కువ. ఉదయం పని ఎక్కువ, రోజంతా పనే. రాత్రికూడా! విరామం లేదు. వర్షం వస్తే పాసింజర్లు తగ్గుతారు. వాన రాకూడదని కోరుకొంటాడు నిత్యానందం. ఏ రైతు ఏమయితే తనకేం? తన వసూళ్ళు తగ్గటం తనకష్టం. ఒకరి సుఖసంతోషాలు, మరొకరి కష్టనష్టాలు. ఏం చేయగలం?

మనిషి గుండె గొప్పది. తల మరీ గొప్పది. కడుపుమాత్రం రోతది. ఈ కడుపే తలకీ, గుండెకీ, సోగ్గాళ్ళకూ, గొప్ప అందమయిన సినీ నటుల, కళాకారుల, నాయకుల అందగాళ్ళకూ దిక్కు. కడుపునిండా కుళ్ళు కల్మషం దుర్గంధం.

వసూళ్ళు పోతేపోనీ అని నిత్యానందం పని మానడు, తాళం వేయడు. తను నిద్రపోయినా తాళం వేయడు. వసూళ్ళున్నా, లేకున్నా తాళం వేయడు. ప్రపంచంలో ఎప్పటికీ తాళం వేయని కార్యాలయం ఇదొక్కటే. తాళం చెవి. తాళం కప్ప అనవసరమే కానీ, ఉన్నాయి. కానీ వాడడు.

నిత్యానందం ఇంట్లో నిద్రపోక పదైదేళ్ళు. పెళ్ళాన్ని మర్చి పుష్కరం. తిండి పెడుతున్నాడు. కాబట్టి నిర్మలమ్మ పెళ్ళాం పదవిలో కొనసాగుతూ ఉంది. లేకపోతే ఏనాడో రిజైన్ చేసేది. అప్పట్లో 'ఏం పెళ్ళికొడకా?' అంటే 'తీరికేది' అని భార్య గడ్డం పట్టుకొని బ్రతిమాలే నీతిమంతుడు నిత్యానందం

తిమ్మిరి తీరక పెళ్ళాం దొంగమేత మేస్తే కష్టమే! నిర్మలమ్మ తిక్కలిదే? ఎంత తిక్కలిదైనా పతివ్రతే! పతిచేసే పనులన్నీ చేస్తుందనికాదు. చేయివలసిన పనులు చేయకపోయినా సహిస్తుంది. 'ఆడుండగా లేంది నాకేం రోగం' అనుకొంటుంది.

తమకెంత కష్టంగా ఉన్నా, ఇంట్లో జరుగుబాటు సక్రమంగానే ఉంది. పట్టుపట్టుమని పదిమంది చుట్టాలు వచ్చినా ఫరవాలేదు.

నడుం పీకుతుంటే, చెట్టుకింద చాపమీద విశ్రాంతి. మేను వాలిస్తే నిత్యానందం తలకాయ సినిమాహాలు.షోలేషోలు!

బాల్యం బంగారమే! అమ్మా నాన్నల ప్రేమ అమృతమే! భార్య వజ్రమే! పిల్లలు రత్నమాణిక్యాలే!

కాలేజీలో చదివే రోజుల్లో రిజర్వేషన్లు, రిజర్వేషన్లు అవి గోలగా ఉండేది. చెప్పులు కుట్టేవాళ్లు అమెరికాలోనో, రష్యాలోనో దేశాధ్యక్షులయ్యారని విన్నాడు నిత్యానందం. తమ కులవృత్తి చెప్పులు కుట్టడమే కాబట్టి తానూ రాష్ట్రపతి కావచ్చుననుకొన్నాడు. భారత ప్రధాని అయినా బాగుండవచ్చు. కనీసం సి.ఎం అయినా చింతలేదు. ఎవరయినా దేహీ అంటే దాన్ని పారేసి ఎంబాసిడరో, కలెక్టరో, యం.పి వో దేనితోనో సరిపెట్టుకోవచ్చుననుకొన్నాడు.

కొన్నింటికి ప్రకటనలు వచ్చాయి. కొన్నింటికి రాలేదు. అన్నింటి వెనకా పెద్ద తతంగమే ఉంది. ఈ గోల నా కొద్దనుకొన్నాడు నిత్యానందం.

పొట్ట దొడ్డది. దాని రంధిముందు ఏ రంధీ రద్దే! పొట్ట గడవాలి, క్లర్కు? రఢీ! వచ్చిందా? రాలేదు! వాచ్‌మేన్, నైట్, టెంపరరీ, పర్మినెంటు కావచ్చు. ఆచూకీ దొరికింది. అదృష్టం కలిసివచ్చింది. నైట్ వాచ్‌మేన్ ఉద్యోగం. రాత్రి డ్యూటీ మేల్కొని ఉండాలి. నిద్రపోకూడదు. నిద్ర చాలా గొప్పది. తనకు చాలా ఇష్టం. తన తండ్రికీ, తాత ముత్తాతలకీ నిద్ర మాచెడ్డ ఇష్టం. అసలు తమ జాతికే నిద్ర వరం. నిద్ర పడితే లేవరు, లేస్తే నిద్ర పోయిందాకా నిలవరు.

అసలే చాలని నిద్ర. పైగా పెళ్ళీ, పెళ్ళం. అటువంటి పెళ్ళం ఇంట్లో ఉంటే నైట్ వాచ్‌మేన్ డ్యూటీ సాధ్యమా? అసాధ్యం. అయినా సాధించాడు. కష్టపడ్డాడు. రెంటికీచెడ్డ రేవడవుతున్నాడు. ఉద్యోగం ఊడిపోయింది. మంచం చేతికి చిక్కింది. మంచం దిగితే ఒట్టు. అయితే పెళ్ళం, లేకపోతే నిద్ర.

ఉద్యోగం నుంచి రిటైరు అయిన తండ్రి, తల్లితో పాటు జీవితం నుంచి రిటైరు కాగా, తిండిపెట్టే దిక్కులేక, నిత్యానందం మంచం దిగాడు. తిండికోసం తిప్పలు. చేయరాని పనులు చేశాడు. కూలీ! హమాలి! రిక్షా డ్రైవరు.

నిత్యానందం రిక్షా తొక్కుతున్నప్పుడు, ప్రధాని పట్టణంలోకి వచ్చాడు. ప్రధాని పేరుకే. ఈ రిక్షా తొక్కగలడా? తొక్కలేదు. కనీసం నడపగలడా? రిక్షానడపలేని వాడు

గవర్నమెంటేం నడుపుతాడు. ప్రతి మినిష్టరు, ప్రధానితో సహా, రిక్షా తొక్కకపోతే మినిష్టరు అయ్యే వీలులేదని శాసనం చేయాలి. బరువు బాధ్యతలు తెలియాలి. ఆకలిని గూర్చి ఆకలి తీరిన వాడు, పేదల కష్టనష్టాలు గూర్చి సంపన్నులు చావుకబుర్లు చెప్పగూడదు. పాలకుడికి ప్రజల కష్టాలు అనుభవపూర్వకంగా తెలియాలి. అప్పుడే మంచి పాలన. ఏనాటికయినా తానీ రాష్ట్రాన్నో, దేశాన్నో పాలించాలి. తనకు సామాన్యుల కష్టసుఖాలు తెలిసినంత బాగా ఇప్పుడున్న ఏ మినిష్టరుకూ తెలియదు.

రిక్షా తొక్కలేక, మూటలు మోయలేక, ఈ డ్యూటీ అంగీకరించాడు. కానీ ఆ పనులు రోజంతా చేయనక్కరలేదు. పదిగంటలు కష్టపడితే పదిగంటలు నిద్రపోవచ్చు. ఈ డ్యూటీకి ఆ అదృష్టం లేదు. తీరిక లేదు.

పెళ్ళికి ముందు వెన్నెల; హంసతూలికా తల్పం, స్వర్గం ఊహించాడు. సౌందర్య సౌఖ్యం తలపోశాడు. రంభ, మేనక, ఊర్వశి, తిలోత్తమ వంటి దేవ వేశ్యల్ని కాక సంసార పక్షంగా ఉండే దేవకన్య పెళ్ళంగా రావాలనే కోరుకొన్నాడు.

కానీ ఈ నిర్మలమ్మతో పెళ్ళయింది. ఈ మనిషి ఎట్లాంటిది? చాకు, బాకు, మేకు, ఏకు, తమలపాకు, మైసూరుపాకు.

తన గుండెలు గూడు. ఆమె గువ్వ.

తన చేతులు పంజరం. ఆమె చిలుక.

చిలుకా గోర్వంకల సంసారం. చిలుక పలుకులు, ఎంగిలి పాలు, ఎంగిలి పళ్ళు, ఎంగిలి తిళ్ళు, ఎంగిలి తీర్థం ఎన్నాళ్ళు? ఎంగిలి చేయటానికి ప్లేటు ఉన్నంత కాలం.

ప్లేటులోకి మెతుకులు ఏరుకువచ్చే పక్షిలా, అక్కుపక్షిలా, ఆగమ్మ కాకిలా తాను వెళుతుంటే ఏడ్చిన నిర్మలమ్మ గుర్తే! ఇంట్లో తింటానికి ఉందిప్పుడు, కాని తాను ఇంట్లో లేడు. తాను ఇంట్లో ఉండగలడు, కానీ తినటానికి ఉండదు.

ఎం.ఏ. అయిన కొడుకు రెండేళ్ళుగా ఫైళ్ళు పట్టుకొని దేశం మీదికి పరంజాడు. వీధులు సర్వేచేశాడు. ఆఫీసుల లెక్కలు తీశాడు. అధికారుల్ని ఆరాతీశాడు. అనధికారుల్ని అర్థించాడు. 'అదిగో' అన్నారు. 'ఇదిగో' అన్నారు. 'ఏదీ?' అన్నారు. 'లేదు!' అన్నారు.

'నే నీడ ఉంటాను. నువ్వింటికి పో. టి.బి.తో చావలేవు' నిత్యానందం కొడుకును చూశాడు. తనను కాపాడటానికి వచ్చిన భగవంతుడే అనుకొన్నాడు. తనకు విశ్రాంతి కావలిసిందే! కొడుక్కు పని రావలసిందే! తనీపని మానవలసిందే! కానీ ఏ పని? ఏ పనయినా ఫరవాలేదు. ఈ పని మాత్రం కాదు. ఇదేట్టాటి పని? బాడ్‌కౌ పని! తల్లీ చిన్నప్పుడు ఈ పనే చేసేది. తానూ చేస్తున్నాడు. తల్లికి ఒకరో ఇద్దరో పిల్లలు. తనకో

వందలు వేలు లక్షల పిల్లలు. ఇందరికి తల్లి కావడం అదృష్టమే. ఈ దురదృష్టం తనకు మాత్రమే సొంతం. ఈ తల్లి పదవి తనదే! ఈ టీ.బీ. తనదే! ఈ రెండూ తన కొడుక్కు అక్కరలేదు. పది తరాలకు సరిపడా తల్లి పదవి తాను నిర్వహించాడు. చాలీ పుణ్యం. దానితో వచ్చిన ఈ పాపమూ చాలు. కొడుక్కీ పుణ్యమూ వద్దు, పాపమూ వద్దు.

'వద్దు! నీకీ పనివద్దు! మరేదయినా పనిచూచుకో, నెలజీతం తెచ్చుకో, కుటుంబాన్ని పోషించుకో, తండ్రి కష్టం తొలగించుకో, టీ.బి.నయం చేయించు అంతే!' అన్నాడు నిత్యానందం.

కొడుకేం మాట్లాడలేకపోయాడు.

ఒకరోజు అన్నం తెచ్చి 'ఏ వొగిసులో జరగాల్సిన ముచ్చట ఆ వొగిసులోనే జరగా'లంది, నిర్మలమ్మ.

'నిజమే'నన్నాడు. 'జరగాల్సిందే'ననీ అన్నాడు.

'పిల్లాడి పెళ్ళి!'

'సరే'

'పిల్లని చూశా'

'సరే'

'లగ్నాలు'

'సరే'

'పెళ్ళి'

'సరే'

'తలంబ్రాలు'

'సరే'

పిల్ల నెత్తిన పిల్లాడు చింతపండు, జిలకర పెట్టిందాకా ఉండి నిత్యానందం డ్యూటీకి వచ్చాడు. నూర్రూపాయలిస్తానని పిల్లవాణ్ణి, మూడు గంటలు పనిలో పెట్టాడు. తాను రాగానే 'వందా వద్దు, నీ బొందా వద్దు, పోరానాకొడకపో' అని పారిపోయాడు వాడు.

ఎవడూ ఈ పని చేయడు. కొడుకూ చేయరాదు. కానీ, ఇక వీడు నా కొడుకు. మంచం దొరుకుతుంది. మంచం దిగడు. సెబాస్! అంతవరకు బాగానే ఉంది.

మంచం దిగడు, భార్యనొదలడు, ఉద్యోగం వేటకు పోడు, ఉద్యోగం లేడిపిల్లను వేటాడలేదు.

ఉద్యోగం లేకపోతే జీతం ఉండదు. జీతం లేకపోతే ఇల్లు గడవదు. ఇల్లు గడవకపోతే, తనను పని మాన్పించలేడు. వైద్యం చేయించలేడు.

ఇంకా కొంతకాలం ఈ పని తప్పదు. ఎన్నేళ్ళు? మూడో నాలుగో! తాను నాలుగేళ్ళు మంచం దిగలేదు. అదీ కొడుక్కు వర్తిస్తుంది. తాను ఇంకా నాలుగేళ్ళు ఈ పని చేయాలి.

ఈ లోపల ఏమవుతుంది? టి.బి ఏం చేస్తుంది? ఆకలి ఏమవుతుంది? తప్పదు నాలుగేళ్ళు. ఈ లోపల జరగరాంది ఏదీ జరక్కుండా ఉంటే మేలు. అన్నింటికి ఆ పైవాడే వున్నాడు.

మళ్ళీ మామూలే! కుర్చీ, టేబిలు, వసూళ్ళు. నీరసంగా ఉంటూ ఉంది. తాను నాలుగేళ్లు బతకలేనేమోనని భయం పట్టుకొంది.

రెండో నెలలో కొడుకువచ్చి తండ్రి చేతిలో నోట్లకట్ట పెట్టి అన్నాడు. 'ఇది నా నెల జీతం!'